రోడ్లన్నీ గుంతలమయం

- ఇల్లంతకుంటలో రోడ్ల దుస్థితి
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- చినుకుపడితే చిత్తడే


వివేకానంద చౌరస్తా వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు


తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద రోడ్డు పరిస్థితి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ లోతైన గుంతలతో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. చినుకుపడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. దీంతో వర్షాకాలం రోడ్డుపై వెళ్లేందుకు పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక వివేకానంద చౌరస్తా నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డు, ముస్కాన్‌పేట వెళ్లే రోడ్డు, స్థానిక మజీద్ నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి మరీ దయనీయంగా మారింది. కనీసం కాలుతీసి వేసేంత కూడా సందు లేకుండా రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. కనీసం మండల కేంద్రంలో రోడ్ల పరిస్థితిని పట్టించుకోని స్థితిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారంటే, ఈ మండలంలో గ్రామాల పరిస్థితి అంచనా వేయవచ్చు.

మీటరు లోతు గుంతలు

వివేకానంద చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు, మజీద్ నుంచి జూనియర్ కళాశాల వరకు ఉన్న రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి, వివేకానంద చౌరస్తా నుంచి ముస్కాన్‌పేట రోడ్డు పంచాయతీరాజ్ పరిధిలోకి వస్తాయి. రోడ్డుపై మీటరు లోతు వరకు గుంతలు ఏర్పడటంతో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలలో మోకాలు లోతు నీరు నిలిచింది. చిత్తడిగా మారిన రోడ్డుతో పాటు ఎక్కడ గుంతలున్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు బాగుచేయించాలని ఏడాదికాలంగా వివిధ పార్టీల నాయకులు నిరసనలు తెలుపుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యే వరకు నిరీక్షించకుండా కనీసం గుంతలు పూడ్చివేసి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చూడాల్సిన స్థానిక పంచాయతీ పాలకవర్గం, అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శ ఉంది. ఇప్పటికైనా స్పందించి గుంతల రోడ్డును బాగు చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకు, అధికారులకు తెలిపాం. నిధులు మంజూరు చేసి రోడ్డు బాగుచేయాలని కోరాం. తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలక్ష్మి, సర్పంచ్, ఇల్లంతకుంట

ప్రమాదకరంగా మారింది



ముస్కాన్‌పేట వెళ్లే రోడ్డు, బస్టాండ్ వెళ్లే రోడ్డంతా మీటరు లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మూడేళ్లుగా రోడ్డు ఇదేవిధంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయాలి.

– బత్తిని స్వామి, రహీంఖాన్‌పేట

రోడ్లు బాగు చేయిస్తాం



గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రోడ్లన్నిటికీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి రోడ్లన్నీ మరమ్మతు చేయిస్తాం. ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం.

– సిద్దం వేణు, జెడ్పీ వైస్‌చైర్మన్

బో'నమో పోచమ్మ'


ఇల్లంతకుంట: బోనాలతో మహిళల ఊరేగింపు

ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లి, బోయినపల్లి మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, గంభీరావుపేట మండల భీమునిమల్లారెడ్డి గ్రామాల్లో మహిళలు ఆదివారం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలెత్తుకుని, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గుడోలు విన్యాసాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. కొదురుపాకలో రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, భీమునిమల్లారెడ్డిపేటలో సర్పంచ్ సర్పంచ్ శెట్టి మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్, ఉపసర్పంచ్ అంజనేయులు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గాండ్ల రాజం, వీడీసీ చైర్మన్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. – గంభీరావుపేట/ఇల్లంతకుంట/బోయినపల్లి


గంభీరావుపేట: మల్లారెడ్డిపేటలో ..

అటెన్షన్ ప్లీజ్



కుంట కాదిది.. రోడ్డు.!

చందుర్తి: వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలో మర్రిగడ్డ గ్రామం వద్ద ఓ మూలమలుపులో వర్షపు నీరు నిలిచి కుంటలా కనిపిస్తోంది. ఈ రోడ్డుపై కల్వర్టుల వద్ద మట్టి నిల్వలు పేరుకుపోవడంతో నీరు బయటికి వెళ్లక తేలికపాటి వర్షానికి సైతం నీరు నిలిచి కుంటగా మారింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు పైపు వద్ద పేరుకుపోయిన మట్టి నిలువను తొలగించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, చందుర్తి
సెల్ నెం: 94408 18862

రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయి. ఆదివారం దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా నాయకులు దోసల ఉపేంద్ర, నాయకులు పాల్గొన్నారు.


దీక్షలకు సంఘీభావం ప్రకటిస్తున్న సుదర్శన్

క్లుప్తంగా

ఆసుపత్రి నిర్మాణంలో అవినీతి

- కళ్లకు గంతలు కట్టుకుని కాంగ్రెస్ నాయకుల ధర్నా


నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ పీహెచ్‌సీలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణంలో అవినీతి చోటుచేసుకుందని కాంగ్రెస్ నాయకులు ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. రూ.1.45 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించిందని ఆరోపించారు. నిర్మాణ సమయంలోనే సిమెంట్ పెచ్చులు ఊడుతున్న ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంజినీరింగ్ అధికారులు భారీ అవినీతికి పాల్పడడంతోనే నాణ్యత లేని పనులు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లు ఉండి లేని గుడ్డి ప్రభుత్వంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి


నియామక పత్రాలను అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలంగాణ పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి 9, 10, 22వ వార్డుల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన బీఆర్‌ఎస్ బూత్ కమిటీ నియామకాలను చేపట్టారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, కౌన్సిలర్లు భూక్యరెడ్డి నాయక్, సత్యనారాయణ, కల్లూరి లత మధు, నాయకులు రాంమోహన్, దడిగెల శ్రవణ్‌రావు, వెంగళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


మాట్లాడుతున్న గుంటి వేణు

తంగళ్లపల్లి: జిల్లాలో పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 20న జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మంచికట్ల రమేశ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదు వేల మంది పోడు సాగు చేస్తూ జీవిస్తున్నారని, వారందరూ హక్కు పత్రాల కొరకు దరఖాస్తు చేసుకున్నా, కేవలం 1,614 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన 3,500 మందికి కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేదలపై పెట్టిన కేసులన్నింటిని ప్రభుత్వం భేషరతుగా ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కాడ రాములు, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట: స్థానిక ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా బచ్చు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఉప్పల కృష్ణమూర్తి, బొందుగుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మందుల రవి, సంయుక్త కార్యదర్శిగా మందుల సిద్ధిరాములు, కోశాధికారిగా అయిత శ్రీనివాస్, సలహాదారులుగా బచ్చు నాగరాజు, పసుపునూరి హన్మండ్లు, కార్యవర్గసభ్యులుగా మూడ శ్రీనివాస్, కోటగిరి రాజేశ్, పందిరి రాము, బొందుగుల అశోక్, బొందుగుల సంపత్, మహంకాళి నర్సింలు, బచ్చు గిరిప్రసాద్ ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ బూత్ కన్వీనర్‌గా చంద్రమౌళి

తంగళ్లపల్లి: మండలంలోని చింతలఠాణ గ్రామం బీఆర్‌ఎస్ బూత్ కన్వీనర్‌గా బొజ్జ చంద్రమౌళిని నియమించినట్లు మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం సత్తయ్య, పొన్నం సత్తయ్య, మాజీ సర్పంచ్ నూనె కిషన్, చీర్లవంచ సర్పంచ్ జక్కుల రవీందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యతతోనే హక్కులు సాధన


డైరెక్టర్లను సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

ముస్తాబాద్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ముదిరాజ్ సొసైటీ జిల్లా డైరెక్టర్ గాడిచెర్ల దేవయ్య అన్నారు. ముస్తాబాద్‌లో నూతనంగా ఎన్నికైన జిల్లా డైరెక్టర్లు గాడిచెర్ల దేవయ్య, శ్రీనివాస్‌ను ఆదివారం సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోనే ముదిరాజ్‌లందరికీ ప్రభుత్వం మత్స్యకార్మికులుగా గుర్తింపు కల్పించి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, జెల్ల వెంకటస్వామి, నర్సింలు, అంజనేయులు, గజ్జెల రాజు, అబ్రమేని సాయిలు, శాడ శ్రీనివాస్, నరేశ్, రాజలింగం పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గానికి సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని పాపయ్యపల్లె గ్రామంలో నూతనంగా ఎన్నికైన మండల యాదవ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు నక్క కొమురయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు గోగు మల్లేశం యాదవ్, ప్రధాన కార్యదర్శి మందాటి తిరుపతి యాదవ్, గౌరవ అధ్యక్షుడు బండి దేవేందర్ యాదవ్, ముఖ్య సలహాదారులు ఆర్కుటి మహేశ్ యాదవ్, గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు నక్క తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్ పర్శరాములు, బాలయ్య, మల్లేశం, మొండయ్య పాల్గొన్నారు.

మత్స్య కార్మిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్‌కు..

చందుర్తి: జిల్లా మత్స్య కార్మిక సహకార సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైనా స్థానికుడు పిట్టల బాబును పెద్దమ్మ ఆలయ ఆవరణలో సన్మానించారు. నాయకులు దారం చంద్రం, పులి సత్తయ్య, మర్రి మల్లేశం, వులిసే అంజయ్య, ప్రసాద్, లింగాల శ్రీను, విజయ్, పోంశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లంతకుంట: ఇటీవల మృతిచెందిన మండలంలోని వల్లంపట్ల, పెద్దలింగాపూర్, తిప్పాపూర్, ఇల్లంతకుంట గ్రామాలకు చెందిన జక్కనపెల్లి పెద్దయ్య, సంకటి కొంరయ్య, దమ్మని బుచ్చెల్లవ్వ, సాదుల బాలవ్వ కుటుంబాలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల బీఎస్సీ హానర్స్ విద్యార్థులు ప్రణీత, శోభారాణి వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందుకున్నట్లు ప్రిన్సిపల్ పద్మజ తెలిపారు. ఆన్‌లైన్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సు పూర్తి చేయడంతో ఈ ప్రశంసాపత్రాలు మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు సమక్షంలో అందుకోవడం అభినందనీయమన్నారు.

వాహన తనిఖీలు


కోనరావుపేట: మర్తనపేట వద్ద తనిఖీలు

కోనరావుపేట/వీర్నపల్లి: కోనరావుపేట మండలం మర్తనపేట వద్ద, వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. హెల్మెట్, పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే వాహనానికి చెందిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వాహనాల తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: రాజన్న ఆలయ ప్రాంతంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు మేమున్నామంటూ మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం 150 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మధు మహేశ్, పాత సంతోష్, పాలాస రాజేందర్, ప్రతాప నటరాజ్, చల్లా సత్తయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట, నాగంపేట, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఇమ్మడోజు రామక్కకు రూ.18 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నాయకుడు మాచర్ల హరీశ్ అందజేశారు. కో–ఆప్షన్ ఉస్మాన్, నారాయణ, రవి పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన చింతల్‌ఠాణా బాలయ్యకు రూ.24 వేలు, బోయిని గంగయ్యకు రూ.20 వేల చెక్కులను ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరె లత, ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్య పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అనిత సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండి జగన్, మండల అధ్యక్షుడు రాజన్న, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, నాయకులు పడిగెల రాజు, క్యారం జగత్, రెడ్డి పర్శరాములు, కోడం సంధ్యారాణి, అనిల్, కరుణాకర్, శ్రీనివాస్, అరవింద్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

మల్లారంలో సామాజిక తనిఖీ

వేములవాడరూరల్: మండలంలోని మల్లారంలో ఆదివారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో వీటిపై వివరాలు సేకరించారు. అన్ని గ్రామాలు పూర్తయిన తరువాత ఈనెల 18న వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేసి వాటిపై పూర్తి సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

క్రీడామైదానం చదును

బోయినపల్లి: మండల కేంద్రంలో మినీ స్టేడియంకు సంబంధించిన క్రీడా మైదానం చదును పనులు ఆదివారం నిర్వహించారు. గ్రామ యువకులు, క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా మైదానం లేకపోవడంతో మైదానాన్ని చదును చేయిస్తున్నారు. ఎ మ్మెల్యే సహకారంతో మినీ స్టేడియం పనులు జరిగేలా చూస్తామని గుంటిశంకర్ తెలిపారు.

పంచాయతీ ఎదుట కార్మికుల ఆందోళన


ముస్తాబాద్: ధర్నా చేస్తున్న కార్మికులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట మండల పంచాయతీ కార్మికులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కార్మికుల శిబిరాన్ని ఎత్తివేసే ప్రయత్నంచేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు సాధించుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

భిక్షాటనతో నిరసన

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు లద్దూరి నర్సయ్య పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయం



తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ఎల్లమ్మ ఆలయంలో పూజలు చెల్లించుకోవడానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

ఎమ్మెల్సీ ఎల్.రమణకు పరామర్శ

తంగళ్లపల్లి: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండి ఎల్.గంగారాం ఇటీవల మరణించగా ఆదివారం తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పడిగెల రాజు, తంగళ్లపల్లి టౌన్ అధ్యక్షుడు బండి జగన్, అంకారపు మహేశ్, నేరెళ్ల అనిల్, వెంగళ రమేశ్, బీమని అరవింద్, కమలాకర్ పాల్గొన్నారు.

'పార్టీపై బురద జల్లేందుకు విద్యుత్ రాజకీయం'

చందుర్తి: రానున్న ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారనే, పార్టీపై కుట్రలో భాగంగానే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి, మూడు గంటల విద్యుత్‌తో పేరిట బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ పబ్బం గడుపుతున్నారంటూ కాంగ్రెస్ పార్టీ చందుర్తి మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. ఆదివారం చందుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్ముకుని ఖాతాల్లో డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్న రైతులు తమ పార్టీని ఎక్కడ నిలదీస్తారోనని బీఆర్‌ఎస్ రాజకీయ డ్రామాకు తెరలేపిందన్నారు. వీరికి రైతులు, ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెప్పేకాలం దగ్గరలో ఉందన్నారు. నిలదీస్తారని ముందస్తుగా కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రచారానికి శ్రీకారం చుట్టారని, ప్రజలెవరూ బీఆర్‌ఎస్ నాయకుల అసత్య ప్రచారాన్ని నమ్మరాదని తెలిపారు. రైతు వేదికలను రాజకీయ వేదికలుగా మార్చేందుకు గ్రామాలకు వచ్చే బీఆర్‌ఎస్ నాయకులను రైతులే తరిమికొడుతారని అన్నారు. సమావేశంలో నాయకులు పులి సత్తయ్య, దారం వెంకటి, వులిస్తే అంజయ్య పాల్గొన్నారు.